ఇక 'ప్రత్యేక' పాలన



నేటితో ముగిసిన గ్రామ పంచాయతీల పాలక మండలిల పదవీకాలం

- రేపటి నుంచి ప్రత్యేక అధికారులను నియమించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ల జాబితా సిద్ధం
- తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని సర్పంచుల విజ్ఞప్తి
- పట్టించుకోని ప్రభుత్వం.. ఆందోళనలో సర్పంచులు
- 6 నెలల తరువాత ఎన్నికలు జరిపేందుకు సర్కారు నిర్ణయం

వరంగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీల పాలక మండలి పదవీకాలానికి నేటి తెరపడనుంది. 2019 ఫిబ్రవరి 2వ తేదీన సర్పంచులు, వార్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరందరి ఐదేళ్ల పదవీకాలం గురువారంతో పూర్తి అవుతుంది. అయితే పంచాయతీలకు ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం ఆసక్తిగా లేకపోవటంతో సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. వివిధ శాఖల అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి అందజేశారు. అయితే తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని సర్పంచులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోలేదు. పంచాయతీల్లో చేసిన పనులకు భారీగా బిల్లులు రావాల్సి ఉందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

స్పెషల్ ఆఫీసర్లు

గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తి కానుండటంతో శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. దీనికి కోసం జిల్లా పంచాయతీ అధికారులు స్పెషల్ ఆఫీసర్ల జాబితాను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్లకు పంపించారు. ఈ జాబితాలో మేజర్ గ్రామ పంచాయతీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. అలాగే పంచాయతీరాజ్ ఏఈలు, ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంఈవోలు, పశువైద్యాధికారులు, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్‌లు, ఎంపీడీవో కార్యాలయ సూపరెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈవోలను గ్రామ పంచాయతీల జనాభా ఆధారంగా స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు గెజిటెడ్, చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను నియమించేందుకు ఏర్పాట్లు చేశారు. కొన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామం కూడా చేశారు. స్పెషల్ ఆఫీసర్లు ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, నూతన నిర్మాణాలకు అనుమతులు, ట్రేడ్ లైసెన్స్‌లు, పన్నుల వసూళ్లు, పచ్చదనం, వీధిదీపాల ఏర్పాటు తదితర పనులను పర్యవేక్షించనున్నారు. ఆరు నెలలపాటు జీపీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగించే అవకాశం ఉంది.

సర్పంచులకు ఝలక్

కరోనా నేపథ్యంలో రెండున్నరేళ్ల గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, స్పెషల్ ఆఫీసర్ల పాలన వద్దని, ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకవచ్చి తమనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని సర్పంచులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారులు అందుబాటులో ఉండరని, జవాబుదారీతనం కొరవడుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి సర్పంచులు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ సర్పంచుల విజ్ఞప్తిపై ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన సర్పంచులే అత్యధికంగా ఉన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం సర్పంచ్‌ల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించలేదనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన రానుండటంతో సర్పంచుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. తమకు రావాల్సిన బిల్లులు ఎప్పటికి వస్తాయో అనే టెన్షన్‌లో ఉన్నారు.

భారీగా పెండింగ్ బిల్లులు

కరోనా కారణంగా రెండేళ్లు గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. ఆ తరువాత పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం సర్పంచులు సొంత డబ్బులను ఖర్చు చేసి పనులు చేశారు. దీంతో కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతీ గ్రామంలో ఇప్పటికే సర్పంచులు రూ.2లక్షల నుంచి రూ.25లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశారు. అయితే తమ పదవీకాలం పూర్తి కాకముందే తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచులు చేసిన విజ్ఞప్తికి కూడా ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు.

గ్రామపంచాయతీలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,688 గ్రామ పంచాయతీలు ఉండగా, ములుగు జిల్లాలోని మంగపేట మండలంలో 23 గ్రామ పంచాయతీలకు మినహా అన్నింటికీ ఎన్నికలు నిర్వహించారు. వీటిలో మహబూబాబాద్ జిల్లాలో 461 గ్రామ పంచాయతీలు ఉండగా, జనగామ జిల్లాలో 281 జీపీలు, భూపాలపల్లి జిల్లాలో 241 పంచాయతీలు, హనుమకొండ జిల్లాలో 208 గ్రామ పంచాయతీలు, వరంగల్ జిల్లాలో 323 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ములుగు జిల్లాలో 174 జీపీలు ఉండగా, మంగపేట మండలంలోని 23 పంచాయతీలు షెడ్యూల్ ఏరియాలోకి వస్తాయనే అంశంపై కోర్టులో కేసు ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ములుగు జిల్లాలో 151 జీపీలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 1665 పంచాయతీల్లోని సర్పంచులు, వార్డు సభ్యులు గురువారంతో తమ పదవులను కోల్పోనున్నారు.

జూన్‌లో సర్పంచ్ ఎన్నికలు...?



గ్రామపంచాయతీల్లో పాలక మండలి పదవీకాలం పూర్తి అవుతున్నప్పటికీ ఎన్నికలకు ప్రభుత్వం ఎలాంటి అడుగులు వేయటం లేదు. దీంతో ఆరు నెలల కాలానికి ప్రత్యేక అధికారులను నియమిస్తోంది. అయితే ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సర్పంచుల ఎన్నికల్లో ఇప్పట్లో జరిగే అవకాశం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జూన్ నెలలో జిల్లా, మండల పరిషత్తు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటితోపాటు సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. పరిషత్తులకు, పంచాయతీలకు ఒకేసారి లేదా వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించవచ్చునే మాటలు వినిపిస్తున్నాయి. అంటే ఆరు నెలల వరకు గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగనుంది.

23న మేడారానికి సీఎం రాక

- వనదేవతలను దర్శించుకోనున్న రేవంత్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జనవరి 31: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 23న మేడారానికి రానున్నారు. 21 నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర క్రమంలో ఆయన వస్తున్నారు. 23న మేడారానికి వచ్చి సమ్మక్క-సారలమ్మను దర్శించుకోనున్నారు. జాతర నిర్వహణ, విధుల సమీక్షలో ఉన్న వరంగల్ ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం ముఖ్యమంత్రి రావడం ఖరారైన క్రమంలో చేపట్టాల్సిన చర్యలను సమీక్షిస్తున్నారు.



వరంగల్ జేపీఎన్ రోడ్డులోని మండిబజార్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జీడబ్ల్యూఎంసీ అధికారులు

ఆక్రమణలపై ఉక్కుపాదం

- నగరంలో అనుమతి లేని నిర్మాణాలను తొలగిస్తున్న జీడబ్ల్యూఎంసీ
- మండిబజార్‌లో అధికారులతో యజమానుల వాగ్వాదం

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 31: వరంగల్ మహానగర పాలక సంస్థ కొద్ది రోజులుగా చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు పర్వం కొనసాగు తోంది. బుధవారం వరంగల్ జేపీఎన్ రోడ్డులోని మండిబజార్‌తో పాటు తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డులోని బెస్తం చెరువువద్ద అక్రమంగా నిర్మించిన ప్రహరీ తొలగింపు చర్యలను జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టారు. మండిబజార్ వద్ద రెండు భవనాలు ఫుట్‌పాత్‌ను ఆనుకొని నిర్మించగా, అధికారులు తొలగించారు. ఈ పరిణామం రగడకు దారి తీసింది. భవనాల యజమానులు వ్యతిరేకించడం, టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు కొనసాగించడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే యత్నం చేశారు. అంతలోనే అధికార పక్ష నేత నుంచి ఫోన్‌రావడంతో అధికారులు కూల్చివేత లను నిలిపివేసి వెనుదిరిగారు. దీనిపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌ను మీడియా సంప్రదించగా ఆయన స్పందించారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, అయితే వారికి ముందుగా నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. కొందరు స్వచ్ఛందంగా తొలగించుకుంటామని చెప్పడంతో సమయం ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో కూల్చివేతలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

బెస్తం చెరువు వద్ద గోడ కూల్చివేత

వరంగల్ తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని బెస్తం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని కొందరు ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. దీనిపై విచారణ జరిపిన ఇరిగే షన్, జీడబ్ల్యూఎంసీ అధికారులు.. ప్రహరీని కూల్చివే శారు. టౌన్ ప్లానింగ్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- జిల్లాలో హాజరుకానున్న 6,087 మంది విద్యార్థులు
- నేటి నుంచి 15 వరకు మూడు విడతల్లో పరీక్షలు

వరంగల్ సిటీ, జనవరి 31 : ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు విడతల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి కాక మాధవరావు తెలిపారు. మొదటి విడత 1 నుంచి 5వ తేదీ వరకు, రెండవ విడత 6 నుంచి 10 వరకు, మూడవ విడత 11 నుంచి 15 జరుగనున్నాయి. జనరల్ గ్రూపులకు 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, వొకేషనల్ గ్రూపు ప్రాక్టికల్ పరీక్షలకు 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 61 బ్యాచ్‌లు జనరల్ విద్యార్థులు, 22 బ్యాచ్‌లు వొకేషనల్ విద్యార్థులు పరీక్షలు మొత్తంగా 6,087 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో జనరల్ విభాగంలో 3,553 మంది, వొకేషనల్ విభాగంలో 2,534 మంది పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి..

- ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టార్‌లా వ్యవహరిస్తున్నారు..
- మా పోరాటం కార్పొరేట్, మతోన్మాదం మీదనే..
- సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో బహిరంగసభ
- నేటి నుంచి జాతీయ సమావేశాలు




పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న తపన్‌సేన్, సభలో అభివాదం చేస్తున్న నాయకులు

హనుమకొండ క్రైం, జనవరి 31: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలని, కార్మిక, కర్షకులు ఒక్కటై ప్రధాని మోదీని గద్దె దించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి తపన్‌సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు ఆల్‌ఇండియా సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశాలు కాజీపేటలో జరగనున్నాయి. ఈ సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో జిల్లా నాయకుడు ఉప్పల య్య అధ్యక్షతన బుధవారం బహిరంగసభను నిర్వహిం చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన తపన్ సేన్ హాజరై ప్రసం గించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో మత విద్వేషాలు రేపుతూ ప్రజల్లో చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. బీజేపీ మతరాజకీయాల వల్ల ప్రజలు సంక్షోభంలో కూరుకుపోతున్నా రని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారి హక్కులను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. తమ పోరాటం కార్పొరేట్, మతోన్మాద శక్తులపైనే అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టార్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల దేశంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేసిన సమ్మె అభినందనీయమని కొనియాడారు. ఫాసిస్టు విధానాలు విజయాలు సాధించిన దాఖలాలు దేశంలో ఎన్నడూ లేవని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 యేళ్లు గడుస్తున్నా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ మతాన్ని రాజకీయంతో మిళితం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు బీజేపీ కపట నాటకాలను గమనిస్తున్నారని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మించి మోదీ ప్రశ్నించే ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర చేస్తున్నాడని అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త భారత్‌బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని తపన్‌సేన్ పిలుపునిచ్చారు.

సీఐటీయూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీని ఓడించకపోతే హక్కులుండవని, ఆ పార్టీని ఓడించడమే ప్రజల కర్తవ్యం కావాలని చెప్పారు. మోదీ ప్రధాని అయిన తర్వాత రాజ్యాంగానికి, హక్కులకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే కవులు, కళాకారులు, మేధావులు, ఉద్యమ కారులను జైళ్లలో పెట్టించారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమకారులైన వరవరరావు, సాయిబాబలు అనారోగ్యంగా ఉన్నా జైళ్లో పెట్టించి చిత్రహింజలు పెట్టారని గుర్తు చేశారు. సనాతన ధర్మంతో మహిళలను కట్టిపడేసే కుట్ర చేస్తు న్నారని విమర్శించారు. చర్చల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

అంతకుముందు ములుగురోడ్డు నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా సీఐటీయూ కార్యదర్శి ఏఆర్ సింధూ, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్రకార్యదర్శులు జి.వెంకటేశ్, రాగుల రమేష్, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రజిత, బొట్ల చక్రపాణి, చుక్కయ్య, వాసుదేవరెడ్డి, మంద సంపత్, పెండ్యాల రవీందర్, జి.వెంకట్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.



మేళాలో ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ట్యాక్స్ మేళా

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 31: రెవెన్యూ సంబంధమైన సమస్యల పరిష్కారానికి ట్యాక్స్ మేళా నగరవాసులకు ప్రయోజనకరంగా ఉంటుందని వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడించారు. హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన ట్యాక్స్ మేళాను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ బుధవారం మేళా నిర్వహణ ఉంటుందన్నారు. ఆస్తి, నల్లా పన్ను, ఇంటి నెంబరు కేటాయింపు, మ్యుటేషన్లు తదితర సమస్యలను మేళా ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. సమస్యపై

మిగతా 8వ పేజీలో..

మాషూక్ రబ్బాని ఉర్సుకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు
- ఒళ్లు గగుర్పొడిచే ఫకీర్ల విన్యాసాలు




ఉర్సులోని మాషూఖ్ రబ్బాని దర్గా

కరీమాబాద్, జనవరి 31: మత సామరస్యానికి, జాతీయ సమైక్యతకు, సర్వమత సమానత్వాన్ని చాటుతున్న ఉర్సు ప్రాం తంలోని ఈ మాషూక్ రబ్బాని 468వ దర్గా ఉత్సవాలు ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు అట్టహాసంగా కొనసాగనున్నాయి. మాషుక్ రబ్బాని రహమతుల్లా అలై 13వ తరానికి చెందిన వారసులు, దర్గా పీఠాధిపతులైన సయ్యద్ షా హైదర్ హిలాలోద్దీన్ ఖాద్రీ నవీద్ బాబా, ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో హజ్రత్ మాషూఖ్ రబ్బాని దర్గా ఉర్సు ఈ నెల 2, 3, 4 తేదీల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా 2వ తేదీ రాత్రి మాషుక్ రబ్బాని పవిత్ర సమాధికి సందల్ (గంధలేపనం) భక్తి శ్రద్ధలతో కొనసాగుతుంది. ఈ గంధలేపనాన్ని హజ్రత్ మాషూఖ్ రబ్బాని రహమతుల్లాలై వంశీయులైన 19వ తరం పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాలోద్దీన్ ఖాద్రీ నవీద్‌బాబా ఇంటి నుంచి దర్గాకు తీసుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. సందల్ కార్యక్రమం ప్రారంభమై దర్గా వద్దకు చేరేవరకు ఫకీరుల విన్యాసాలు ఒళ్లు గుగుర్పొడిచే విధంగా ఆకట్టుకుంటాయి. 3వ తేదీన ఉర్సు ఉత్సవాలు, 4వ తేదీన ప్రత్యేక ప్రార్థనలతో దర్గా ఉత్సవాలు ముగుస్తాయి.

మహిమాన్వితమైనది..

వరంగల్ నగరంలో అతి పురాతన, చారిత్రకమైన ప్రసిద్ధిగాంచిన దర్గాల్లో ఉర్సు ప్రాంతంలోని హజ్రత్ మాషూఖ్ రబ్బాని దర్గా చెప్పుకోదగినది. సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగినది ఈ ఉర్సు దర్గా. ఈ దర్గా చాలా మహిమాన్వితమైనదిగా ప్రజల నమ్మకం. ఎలాంటి సమస్యలున్నా ఈ దర్గాను దర్శించుకుంటే సమస్యలు దూరమవుతాయని ప్రజల విశ్వాసం. అందుకే దేశ, విదేశాల నుంచి యేటా ఇక్కడ జరిగే దర్గా ఉత్సవాలకు వస్తుంటారు. చుట్టుపక్కల గ్రామాల వారే కాకుండా,

మిగతా 8వ పేజీలో..

జిల్లాలో 179 మందికి నర్సింగ్ పోస్టులు



వరంగల్ కలెక్టరేట్ , జనవరి 31 : రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో నర్సుల పోస్టుల నియామకాలను అందజేశారు. వరంగల్ జిల్లాకు చెందిన 181 మందికి నియామకాలు రాగా, ఇందులో ఇద్దరికి సంబంధించిన సర్టిఫికెట్ల ఆలస్యంతో 179 మందికి పోస్టింగ్‌లు అందాయి.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు, జనవరి 31: పోలీసు ఉద్యోగం రాలేదని మనస్థాపంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జనవరి 13న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే..

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి రమ - సారంగం దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు శ్రీకాంత్ (25) అనే యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. హైదరాబాద్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ పడింది. ఈ పరీక్షకు కూడా హాజరయ్యాడు. ఫిజికల్ టెస్టులన్నీ పాస్ అయ్యాడు. లిఖిత పరీక్షలో రెండు మార్కులు తగ్గడంతో శ్రీకాంత్ ఉద్యోగానికి ఎంపిక కాలేక పోయాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్న శ్రీకాంత్‌ను తల్లిదండ్రులు ఓదార్చే ప్రయత్నం చేశారు. ఉద్యోగం రానందుకు బాధపడాల్సిన అవసరం లేదని, తమతో పాటు వ్యవసాయం చేసుకొని బతకొచ్చని ధైర్యం చెప్పారు. అయినా మానసికంగా కుంగిపోయిన శ్రీకాంత్.. ఆ వేదన నుంచి బయటకు రాలేకపోయాడు. జనవరి 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందుతాగాడు. చుట్టుపక్కలవారు చూసి ఆయనను వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చెట్టంత కొడుకు దూరమైనందుకు తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. మృతుడు అవివాహితుడు. శ్రీకాంత్ మృతితో నీరుకుల్ల గ్రామంలో విషాదం నెలకొన్నది.



శ్రీకాంత్(ఫైల్)

నేటి నుంచి గ్రూప్స్ ఉచిత శిక్షణ ప్రారంభం

హనుమకొండ రూరల్, జనవరి 31: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఈనెల 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీపీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మందిని ఎంపిక చేశామన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ చలాన్ల గడువు పొడగింపు

హనుమకొండ క్రైం, జనవరి 31: పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై రాయితీతో చెల్లించే గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన గడువు జనవరి 31తో ముగియడంతో ప్రజల అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 15 వర కు పొడిగిస్తూ మార్గదర్శకాలను విడుదల చేసిందని పేర్కొన్నారు. డిసెంబరు 25 వరకు ఉన్న చలాన్లు మాత్రమే ఈరాయితీకి వర్తిస్తుందని తెలిపారు. ద్విచక్రవాహనాలకు, ఆటోలకు 80శాతం, ఆర్టీసీ బస్సులకు 90శాతం, ఇతర వాహనాలకు 60శాతం రాయితీలో చలాన్లను చెల్లించవచ్చని సీపీ సూచించారు.

5 నుంచి ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 31: కేయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు అమె పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 5, 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షల నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు.

ఖిలాషాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు


పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

హనుమకొండ క్రైం, జనవరి 31: జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం ఖిలాషాపూర్‌లో బుధవారం బెల్టు షాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో రూ.23 వేల విలువ గల వివిధ రకాల బ్రాండ్లకు సంబంధించిన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన చెవ్వ అంజయ్య అనే వ్యక్తి చాలారోజులుగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించి పెద్దఎత్తున మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 23వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని రఘునాథపల్లి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నోట.. ట్రైబల్ వర్సిటీ మాట..

సమ్మక్క సారలమ్మ పేరిట ఏర్పాటు చేస్తున్నామంటూ వెల్లడి ● పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ద్రౌపది ముర్ము ప్రసంగంలో ప్రస్తావన

ములుగు, జనవరి 31: జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు భారీ ముందడుగు పడింది. బుధవారం జరిగిన పార్లమెంట్ బడ్జెట్ ప్రారంభ సమావేశంలో ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూనివర్సిటీ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో సమ్మక్క, సారలమ్మ పేరిట గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే క్రమంలో గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండగా యూనివర్సిటీపై ఆశలు రేకెత్తుతున్నాయి. కేటాయింపులు ఏమేరకు ఉంటాయోననే ఆసక్తి నెలకొంది.


ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంకోసం కేటాయించిన స్థలం

వడివడిగా అడుగులు

ఏపీ పునర్విభజన చట్టం 2014లో తెలంగాణకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీపై ఇటీవలే ఆశించిన స్థాయిలో కదలిక కనిపించింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ వర్సిటీపై ప్రకటన చేశారు. మహబూబ్‌నగర్‌లో అక్టోబరు 1న జరిగిన బహిరంగ సభలో గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ పేరిట జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేస్తామని, ఇందుకు ములుగు ప్రాంతంలో స్థల సేకరణ కూడా జరిగిందని తెలిపారు. ఆతర్వాత యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. యూనివర్సిటీల చట్టసవరణ బిల్లులో ట్రైబల్ వర్సిటీని కూడా చేర్చగా గత ఏడాది డిసెంబరు 7న పార్లమెంటులో, డిసెంబరు 13న రాజ్యసభలో ఆమోదం పొందింది. అదే నెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. జనవరి 16న హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ అధికారుల బృందం ములుగు సమీపంలోని గట్టమ్మ వద్ద యూనివర్సిటీ కోసం కేటాయించిన 335 ఎకరాల స్థలాన్ని పరిశీలించింది. వీసీ బి.జె.రావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్ స్థలంతోపాటు తరగతుల నిర్వహణ కోసం జాకారం వద్దగల ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనాలను పరిశీలించారు. తాజాగా 24 తేదీన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ యూనివర్సిటీ, హెచ్‌సీయూ అధికారులతో కలిసి మరో సారి స్థలాన్ని, జాకారం వైటీసీ భవనాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు జరిగే అవకాశముందని వెల్లడించారు.


తాత్కాలిక క్యాంపస్ నిర్వహణకోసం ఎంపికచేసిన జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్

కేటాయింపుపై ఆసక్తి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాని ప్రకటన, తాజాగా పార్లమెంటు ఎన్నికల ముందు రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన ఈ రెండు సందర్భాలను పలువురు రాజకీయ కోణంలో చూస్తున్నప్పటికీ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కలిసొచ్చిన సమయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్థల కేటాయింపు అంశాన్ని రాష్ట్రానికి అప్పగించి యూనివర్సిటీ స్థాపనకు అయ్యే పూర్తి ఖర్చు బాధ్యతను స్వీకరించింది. నిర్మాణం కోసం రూ.889 కోట్లను కేటాయించే అవకాశముందని ఇటీవల ప్రకటన కూడా వచ్చింది. అయితే ప్రస్తుతం జరిగే బడ్జెట్ సమావేశాలు చివరివి కావడంతో ఏ మేరకు కేటాయింపులు జరుగుతాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. కేటాయించిన నిధులను విడుదలచేసి శంకుస్థాపన చేయాలని, సత్వరమే పనులు కూడా మొదలు పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పత్తి రైతులకు సీసీఐ భరోసా

వరంగల్‌టౌన్, జనవరి31: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లను జనవరి 31 నుంచి నిలిపివేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజంలేదని, పత్తి కొనుగోళ్లను కొనసాగిస్తుందని సీసీఐ వరంగల్ బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అర్జున్ ఎస్.దవే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన పత్తి పంటకు మద్దతు ధర కల్పించేందుకు సమీపంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పత్తి రైతులు ఎవరూ నిరాశ చెందకుండా తమ పత్తిని సీసీఐ కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సీసీఐ వెబ్‌సైట్. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సీవోటీసీవోఆర్‌పీ.ఓఆర్‌జీ. ఇన్‌ను సంప్రదించవచ్చునని, లేదా కాట్-అల్లీ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు

కొత్తగూడ, జనవరి31: విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలైన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ప్రకారం వేలుబెల్లి గ్రామానికి చెందిన మురహరి రవికుమార్ కుమారుడు మంగళవారం చాణక్య ఇంటి డాబాపైకి వెళ్లి బస్తాలు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్సకోసం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

దొంగల చేతివాటం

మేడారం, జనవరి 31: మేడారంలో దొంగల చేతివాటం పరిపాటిగా మారింది. వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి మేడారం చేరుకున్న భక్తులు విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. బుధవారం సుమారు 10 మంది భక్తులు మొత్తం రూ.లక్షకు పైగా నగదు, రెండు తులాల బంగారాన్ని కోల్పోయారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. సీసీకెమెరాలను పరిశీలించినా పోలీసులకు దొంగల ఆచూకీ లభించలేదు.

వనదేవతలకు మొక్కులు

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

మేడారం, జనవరి 31: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారమ్మలకు మొక్కుల చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివాసీ సంప్రదాయాలతో తల్లులను దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, డోలి వాయిద్యాల నడుమ సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ గద్దెల వద్దకు చేరుకునానరు. క్యూలైన్ల ద్వారా మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 50 వేల భక్తులు మేడారం వన దేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పోలీసులు పకడ్బందీ చర్యలు

వనదేవతలకు ముందస్తు మొక్కలు చెల్లించుకోవడానికి తరలి వస్తున్న భక్తులు నేరుగా తల్లి గద్దెలను దర్శించుకునేలా పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సుమారు 50 వేల మంది తరలి రావడంతో గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గేట్లు మూసివేయకుండా నేరుగా భక్తులు గద్దెలకు చేరుకొనేలా ఏర్పాట్లు చేయగా వారు దర్శనాలు చేసుకునేందుకు క్యూలైన్ల వద్ద పోలీసులు ఎంతో శ్రమపడాల్సి వచ్చింది.

500 మందితో ట్రాఫిక్ నియంత్రణ

వనదేవతలను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారి వాహనాలతో మేడారం కిటకిటలాడింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. దారి పొడవునా 25 రూట్ మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించారు. ఎస్పీ శబరీశ్ స్వయంగా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. పస్రా నుంచి మేడారం వరకు వాహనాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. భక్తులు నేరుగా గద్దెల సమీపానికి చేరుకునేలా వన్‌వే రూట్‌ను ఏర్పాటు చేశారు. ఊరట్టం క్రాస్ వద్ద భారీ గేట్లు చేసి వాహనాలను పార్కింగ్‌లోకి మళ్లించారు. జంపన్నవాగు ఒడ్డుపై నుంచి గద్దెల సమీపంలోని పార్కింగ్‌లకు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు మొత్తం 500 మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు.


జంపన్నవాగులో పుణ్యస్నానాలు

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మల్లారెడ్డి

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం ● పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహచారి ● ఇతర పదవుల్లో సైతం నియామకం

కేయూ క్యాంపస్, జనవరి 31: కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ పొందిన వారిని పదవుల్లో కొనసాగడంపై అభ్యంతరాలను వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే రిటైర్డు అయిన ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రిజిస్ట్రార్‌గా కొనసాగగా, పదవి నుంచి తప్పుకున్నట్లు అయింది. దీంతో పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ మల్లారెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి గణితశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే సైన్స్ విభాగం డీన్‌గానూ పనిచేస్తున్నారు. 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2010లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ కంపెనీతో రెండేళ్లపాటు పనిచేసి తైవాన్‌లో 5 ఏళ్లపాటు పోస్టు డాక్టరల్ డిగ్రీ పూర్తి చేశారు. 1998లో ఉస్మానియాలో పీహెచ్‌డీ పూర్తి చేయగా, సీఎస్‌ఐఆర్ యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించారు. సీఎస్ఐఆర్, యూజీసీ, డీఎస్‌టీ ప్రాజెక్టులను పూర్తిచేశారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి పర్యవేక్షణలో 16 మంది పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఇంటర్నేషనల్, నేషన్ జర్నల్స్‌లో దాదాపు 100 పరిశోధన పత్రాలను ప్రచురించారు. వర్సిటీ పాలక మండలి సభ్యులుగా 4 ఏళ్ల కొనసాగారు.


రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డికి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రంకు, పరీక్షల నియంత్రణాధికారి నరసింహచారికి నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ రమేశ్, మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం

కేయూ దూరవిద్య కేంద్రం నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్థానంలో ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను నియమించారు. ప్రొఫెసర్ రామచంద్రం కేయూ సైకాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహచారి

కేయూ కొత్త పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రొఫెసర్ మల్లారెడ్డి పరీక్షల నియంత్రణాధికారిగా కొనసాగడంతో ఆయన స్థానంలో నరసింహచారిని నియామించారు.

అలాగే కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధుల్లో ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందంను నియమించారు. ఇప్పటివరకు కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మల్లారెడ్డి స్థానంలో సదానందంను నియామించారు. కేయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పి.అమరవేణి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగిన ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి స్థానంలో అమరవేణిని నియమించారు. సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి నియమితులయ్యారు. ఇప్పటివరకు అమరవేణి ప్రిన్సిపాల్‌గా ఉన్న స్థానంలో వరలక్ష్మిని నియమించారు.

అలాగే వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్‌ను నియమించారు. వీరిఉత్తర్వులను ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు జారీ చేశారు. నూతనంగా పరిపాలన పదవుల్లో నియమితులైన ప్రొఫెసర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సోనియాను కలిసిన రిజిస్ట్రార్ రవి

వరంగల్ ఎంపీ టికెట్ అభ్యర్థన.. బయోడేటా అందజేత

హనుమకొండ సిటీ, జనవరి 31: వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీని కలిశారు. వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్న రవి.. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సోనియాను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమెకు తన బయోడెటాను అందచేశారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర, ఉద్యోగుల సమస్యలపై పోరాటం, సామాజిక సేవా కార్యక్రమాలు, కరోనా సమయంలో అందించిన సేవలు, నిరుపేద కుటుంబం నుంచి ఉద్యోగపరంగా ఉన్నతాస్థాయికి ఎదిగిన తీరు, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విధానాలను జనంలోకి తీసుకెళ్లడం తదితర అంశాలను సోనియాగాంధీకి వివరించారు. టికెట్ కేటాయిస్తే అందరి సహకారంతో విజయం సాధిస్తానని రవి విన్నవించుకున్నారు. దీనిపై సోనియాగాంధీ స్పందిస్తూ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఏకంగా సోనియాగాంధీనే కలిసి టికెట్ కోసం రవి అభ్యర్థించడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.


సోనియాగాంధీతో రవి

ఎంపీ టికెట్ కోసం ఆనంద్ దరఖాస్తు

వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాలని కోరుతూ హనుమకొండకు చెందిన మోజెస్ ఆనంద్ పాల్ దరఖాస్తు సమర్పించారు. బుధవారం హైదరాబాద్‌లో దరఖాస్తును గాంధీభవన్‌లోని సిబ్బందికి అందచేశారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి చేసిన సేవలు, సామాజిక కార్యక్రమాలతో కూడిన బయోడెటాను సమర్పించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయస్థాయి ఫెస్ట్‌కు గురుకుల విద్యార్థినుల ఎంపిక

మడికొండ, జనవరి 31: హైదరాబాద్‌లో డిసెంబరు 6న జరిగిన స్టెమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫెస్ట్-2023-24లో ఫుట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టమ్ ప్రాజెక్టులో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 5వ స్థానంలో నిలిచారు. జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో తమ ప్రాజెక్టు ఫుట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టమ్‌ను ప్రదర్శించడానికి అర్హత సాధించారు. ఈ ప్రాజెక్టుని ఫిబ్రవరి 1, 2 తేదీలలో బెంగుళూరులోని ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో జరగబోయే జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో ప్రదర్శిస్తారు. 10వ తరగతి విద్యార్థినులు శ్రుతి, రమ్యలను వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఎస్.విద్యారాణి, మడికొండ ప్రిన్సిపాల్ ఎస్.మల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు కె.జ్యోతితో పాటు అధ్యాపక బృందం అభినందించారు.

ఎంజీఎం ఆస్పత్రిఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 31 : వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షులు గజ్జెల రాంకిషన్, కార్యదర్శి గాదె వేణుగోపాల్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి ఎంజీఎం సూపరింటెండెంట్ వలుపదాసు చంద్రశేఖర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, ఎంజీఎం ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ యూనిట్ కోశాధికారి శ్రీనివాస్, ఎంజీఎం యూనిట్ నాయకులు రవికుమార్, రవీందర్, నాగేశ్వర్‌రావు, రవీందర్, అశోక్, రాజేష్, గణేష్,. ప్రమీలావతి, తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

కోటలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

ఖిలావరంగల్, జనవరి 31 : ప్రజలలో ఉన్న అసమానతలను తొలగించేందుకు, సమ సమాజ స్థాపన ఒక్కటే పరిష్కార మంటూ ఉద్యమించిన ప్రజా నాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని అడ్వకేట్ అయిత అనిల్ కొనియాడారు. బుధవారం ఖిలావరంగల్ అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం, కార్మిక సంఘం, యువజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ అట్టడుగు పేదరికం నుంచి ఈ దేశంలోని అంటరాని తనం, పేదరిక సమస్యలకు పరిష్కార మార్గం సోదించేక్రమంలో మనల్ని వీడిపోవడం చాలా బాధార కమన్నారు. తన వెన్నులో 6 తుపాకీ గుండ్లు ఉన్నా, ఏనాడు శత్రువుకి వెన్ను చూపని ధీరుడని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుద్దాల నాగరాజు, మైదం రవి, దుపాకి డైమన్‌బాబు, మైదం బాబు, సినీ దర్శకుడు దర్శ నాల సుబాష్, బరిగెల రాజేందర్, భైరబోయిన రవీందర్, అక్బర్, నలిగంటి బొబ్బిలి, గద్దల ప్రసాద్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు

శంభునిపేట, జన వరి 31 : నగరంలోని రంగశాయిపేట ప్రభు త్వ ఉన్నత పాఠశా లలో బుధవారం పద వ తరగతి విద్యార్థు లకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను పాఠశాల హెచ్‌ఎం వి. రామకృష్ణా రెడ్డి ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖాదికారిణి ఆదేశాల మేరకు స్కూల్ కాంప్లెక్స్‌లోని పదవ తరగతి విద్యార్థుల కొరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలో ఒక రోజు ఓరియం టేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. వివిధ సబ్జెక్టుల రీసోర్స్ పర్సన్స్ సీహెచ్ శ్రీనివాస్, ఎమ్డీ గౌస్, రాజేష్, వేణు, సంపత్, సీహెచ్ కృష్ణ, టి రమేష్, సీఆర్పీ డి.వెంకటాచారి ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మార్కెట్‌లో మహిళా కూలీల ఆందోళన

వరంగల్‌టౌన్, జనవరి 31 : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మహిళా కూలీలు బుధవారం ఆందోళనకు దిగారు. తమను మార్కెట్లోని అన్ని యార్డులలో పని చేసుకోనివ్వాలని కొద్దిసేపు మహిళా కూలీలు ఆందోళన చేశారు. మిర్చి యార్డులో కూడా పని చేసు కొనివ్వాలని వారు కోరారు. అనంతరం మార్కెట్ కార్యాలయానికి వెళ్లి మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్యను కలిసి తమకు మార్కెట్లోని అన్ని యార్డులలో పని చేసుకునే విధంగా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళా కూలీలు వారి సమస్యలను రాతపూర్వకంగా రాసిఇచ్చారు. కాగా, స్పందించిన మార్కెట్ కార్యదర్శి సంగయ్య 'నేను వచ్చి మిమ్మల్ని ఆపింది లేదు, నేను కొత్తగా అనుమతించేది లేదు' ఏదైన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతి మేరకు మీకు అవకాశం కల్పించడం జరుగుతుందని వారికి చెప్పారు.

టెక్స్‌టైల్ పార్కు పనులపై ఎమ్మెల్యే రేవూరి ఆరా



అధికారులతో సమీక్షిస్తున్న రేవూరి ప్రకాశ్ రెడ్డి

హనుమకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ పనులు నత్తనడకన సాగుతుండడంపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హనుమకొండ ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశం అయ్యారు. పార్క్ పనుల పురోగతిపై చర్చించారు. అక్కడ యూనిట్ల ఏర్పాటుపై ఆరా తీశారు. పార్క్‌కు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 8వ తేదీన టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శిస్తానని, ఏర్పాటు చేస్తున్న యూనిట్లను పరిశీలిస్తానన్నారు. అధికారులు, పరిశ్రమల నిర్వాహకులు హాజరుకావాలని అన్నారు.

శిథిలావస్థలో దేశాయిపేట బ్రిడ్జి

- బ్రిడ్జిపై గుంతలు, సలాకులు తేలిన రోడ్లు
- కూలిపోతున్న బ్రిడ్జి సైడ్ రెయిలింగ్
- భయంతో ప్రయాణిస్తున్న వాహనదారులు



సైడ్ రేయిలింగ్‌లు కూలిపోతున్న దేశాయిపేట బ్రిడ్జి



గుంతలతో సలాకులు తేలిన దేశాయిపేట బ్రిడ్జి

పోచమ్మమైదాన్, జనవరి 31 : నగర కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కాకతీయ కెనాల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. పాలకులు, ప్రభుత్వాలు మారినప్పటికీ బ్రిడ్జి కనీస మరమ్మతులకు నోచుకోలేదు. అనేక సంవత్సరాలుగా పట్టించుకునే వారు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదపు అంచున భయంతో ప్రయాణించాల్సిన దయనీయ స్థితి కనబడుతుంది.

గ్రేటర్ వరంగల్ నగరంలోని దేశాయిపేట బ్రిడ్జి (వంతెన) శిథిలావస్థకు చేరింది. సలాకులు తేలి, పిల్లర్లు విరుగి ప్రమాదకరంగా మారడంతో, ఎప్పుడు కూలుతుందో తెయని పరిస్థితిలో వాహనదారులు భయంతో పయణించాల్సిన పరిస్థితి తలెత్తింది. దేశాయిపేట మీదుగా పైడిపెల్లికి వెళ్ళే ప్రధాన రహదారిలో కాకతీయ కెనాల్‌పై ఉన్న బ్రిడ్జి సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు మరల కనీసం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దేశాయిపేట మీదుగా పైడిపెల్లి, ఆరెపల్లి నేషనల్ హైవేకు నిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. ఆటోనగర్ ప్రాంతం సమీపంలో ఉండటంతో నిత్యం భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీనికి తోడు నేషనల్ హైవే సమీపంలో ఉండటంతో భారీ వాహనాల తాకిడి మరింత అధికంగా ఉంటుంది. ప్రతీ రోజు రద్దీగా ఉండే ప్రాంతంలో ఎటు వైపు వెళ్లాలన్నా బ్రిడ్జి మీదుగా పయనించాల్సిందే. అయితే ప్రస్తుతం బ్రిడ్జి పరిస్థితి శిథిలావస్థకు చేరి అధ్వానంగా మారింది.

సలాకులు తేలి, గుంతలతో అధ్వానంగా...

సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జిపై సలాకులు తేలి, గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడిన గుంతలలో నీరు నిలిచి బ్రిడ్జి కనబడని పరిస్థితులు ఉన్నాయి. దీంతో వర్షాలు పడినప్పుడు అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక బ్రిడ్జి సైడ్ రేయిలింగ్‌లు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరి కూలిపోతున్నాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పయనించాల్సి వస్తుంది. కొంచం తేడా వచ్చినా కాకతీయ కెనాల్‌లో పడిపోవాల్సిందే అనే విధంగా భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. బ్రిడ్జిపై గుంతలు పడి పలు చోట్ల రంధ్రాలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు బ్రిడ్జిపై నుంచి వెళ్లినప్పుడు బ్రిడ్జి మొత్తం కదులుతుంది. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉన్న బ్రిడ్జి పై నుంచి వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల మంది ప్రయాణించే బ్రిడ్జిని ఇలా వదిలేయడం సరికాదని, ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిని పునఃనిర్మించాలని వేడుకుంటున్నారు.

మేడారం బస్‌పాయింట్ కోసం స్థల పరిశీలన

- శుభ్రం చేసిన ఆర్‌టీసీ సిబ్బంది



రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశుభ్రం చేసిన ఆర్‌టీసీ సిబ్బంది

గిర్మాజిపేట, జనవరి 31 : వరంగల్ ఆర్‌టీసీ నూతన బస్‌స్టేషన్ నిర్మాణం కోసం గతంలో శంకుస్థాపన చేసిన స్థలాన్ని బుధవారం ఆర్‌టీసీ సిబ్బంది శుభ్రం చేశారు. మేడారం జాతర వరంగల్ బస్‌స్టేషన్‌కు అనువైన స్థలం అందుబాటులో లేకపోవడంతో బుధవారం ఆర్‌టీసీ ఆర్‌ఎం శ్రీలత, డిప్యూటీ ఆర్‌ఎం భానుకిరణ్, హనుమకొండ బస్ డిపో మేనేజర్ ధరమ్ సింగ్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, ట్రాఫిక్ పోలీసు అధికారులు ఈ స్థలాన్ని సందర్శించారు. దీనిని మేడారం బస్‌పాయింట్‌గా వినియోగించాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా స్థలాన్ని శుభ్రం చేశారు. ఇందులో నిర్వహిస్తున్న రోడ్ సైడ్ హోటళ్లను రాత్రిలోగా ఖాళీ చేయాలని హోటల్ నిర్వాహకులకు ఆర్‌టీసీ అధికారులు చెప్పారు. గురువారం నుంచి మేడారం బస్‌పాయింట్ ఏర్పాటు చర్యలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పాయింట్ నుంచే భక్తులు మేడారం బస్సులు ఎక్కేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సులను మాత్రం ఓ సిటి మైదానంలో నిలుపాలని ఆర్‌టీసీ అధికారులు నిర్ణయించారు.

చురుకుగా వంచనగిరి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



చురుకుగా సాగుతున్న రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు

గీసుగొండ, జనవరి 31 : మండలంలోని వంచనగిరి రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత కొంత కాలంగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించారు. రైల్వేట్రాక్‌కు ఇరువైపుల 130 మీటర్ పొడవుతో ర్యాంప్ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. రైల్వేట్రాక్ దిగువున మాత్రం 5.5 మీటర్‌లు వెడల్పు, 5.5 మీటర్‌ల ఎత్తు, 32.5 మీటర్‌ల పొడవుతో అండర్‌పాస్ టన్నెల్‌ను నిర్మిస్తారు. దీని గుండా వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కోటగండి, వంచనగిరి, శాయంపేటహవేలి, టెక్స్‌టైల్‌పార్కు మీదుగా సంగెం వరకు రైల్వేగేటు ఆటంకం లేకుండా వాహనాలు వెళ్లేందుకు ఈ మార్గం ప్రయాణికులకు అనుకూలంగా మారుతుంది. అంతే కాకుండా వంచనగిరి మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులకు రైల్వేగేటు కష్టాలు తప్పనున్నాయి. బ్రిడ్జి నిర్మాణం మార్చి చివరినాటికి పూర్తిచేసేందుకు రైల్వే అధికారులు పనులను వేగవంతంగా చేస్తున్నారు.



ఆలయంలో రంగశాయిపేట మిత్ర కుటుంబ సభ్యులు

పూరీ జగన్నాథుడి సన్నిధిలో నగరవాసులు

శంభునిపేట, జనవరి 31 : నగరంలోని రంగశాయిపేటకు చెందిన ఫ్యామిలీ మిత్ర సంఘం సభ్యులు బుధవారం పూరీ జగన్నాథుని ఆలయాన్ని దర్శించుకున్నా రు. మిత్రుల కుటుంబ సభ్యులతో కలిసి ఫ్యామిలీ మిత్ర బృందాన్ని ఏర్పాటు చేసుకొని సోమవారం రాత్రి ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్‌లకు విహార యాత్రకు బయలుదేరారు. పర్యటనలో భాగంగా బుధవారం పూరీ జగన్నాథుని ఆలయాన్ని సందర్శించి తమ కోరికలు నెరవేరాలని వేడుకున్నారు. పర్యటనలో కోణార్క్ సూర్యదేవాలయంతోపాటు పలు పర్యాటక ప్రదేశాలకు వీక్షించనున్నారు. ఈ పర్యటనలో సంఘం డైరెక్టర్‌లు శెంకేశి కుమార్, నిమ్మల సదానందం యాదవ్, కర్నె రవీందర్, జనగాం మల్లికార్జున్, బైరి నాగరాజు, శేఖర్ రెడ్డి, బక్కి రవీందర్, నేతల స్వామి, బక్కి నాగేందర్, నవీన్‌రెడ్డి, గంగాధర్, మామిడాల రమేష్, కరుణాకర్‌లతో పాటు సుమారు 40 మంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వడుప్సా బాధ్యులు

కరీమాబాద్, జనవరి 31 : ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు వడుప్సా ఖిలా వరంగల్ జోన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం 39వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని చాణక్య విద్యానికేతన్‌లో వడుప్సా ఖిలా వరంగల్ జోన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అచ్చ వినోద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 2023 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన అచ్చ వినోద్‌కుమార్, బండి చక్రపాణి, అంగపాటి రాజు, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రెసెడెంట్ ముక్కెర రవీందర్, సెక్రటరీ దాస్య సతీష్ మూర్తి, కోశాధికారి సుధీర్, ముఖ్య సలహాదారులు బిల్ల రవి, వీరస్వామి, శ్యామ్ యాదవ్, రవి, వెంకన్న, కోడెం శ్రీధర్, జ్ఞానేశ్వర్ సింగ్, మోహన్, క్రాంతి, శ్రీను, అవినాష్ పాల్గొన్నారు.

పరపతి సంఘం సభ్యులకు ఆర్థిక సహాయం

వరంగల్ సిటీ, జనవరి 31: కాకతీయ పరస్పర సహాయక సహకార పరపతి సభ్యులకు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భనకు ఆర్థిక సహా యం అందజేశారు. బుధవారం పెరుకవాడలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ సభ్యుడి వాటా ధనం నుంచి రూ.8వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సంఘ సభ్యులందరూ ఈనెల 5 వరకు సంఘంలోని కోశాధికారిని కలిసి డబ్బులను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముత్తినేని శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి గటికకొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన వారే మనవారు..

- సర్పంచ్‌ల వీడ్కోలు సభలో ఎమ్మెల్యే రేవూరి



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

గీసుగొండ, జనవరి 31 : మర్యాద పూర్వకంగా ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల వీడ్కోలు, సన్మాన కార్యక్రమానికి వచ్చిన సర్పంచులే మనవారంటూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండ లంలో 21 మంది సర్పంచ్‌లు ఉండగా 10మంది మాత్రమే సమావేశానికి రావటం విచారక రమన్నారు. ఒక నాయకుడు వీడ్కోలు సమా వేశానికిపోవద్దనిచెపితే సర్పంచ్‌లు రాకపోవడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో మండలంలోని ఆయా గ్రామాల్లో చేసిన పనులకు రూ.19 కోట్ల బకాయిలు ఉన్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇపుడు బీఆర్‌ఎస్ నాయకులు సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారికి బిల్లులను ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పెండింగ్ బల్లుల వివరాలను సక్రమంగా ఇవ్వలేదని సంబంధిత అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అందరు కలిసి రావాలన్నారు. అనంతరం సర్పంచ్‌లను ఆయన శాలువాలతో సన్మానించారు. కాగా, 5 సంవత్సరాలు కలిసి పని చేసిన మహిళా సర్పంచ్‌లు, కార్యదర్శులు కన్నీరుపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, వైస్‌ఎంపీపీ రడం శ్రావ్యభరత్, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సొంత పార్టీ వారినే ఇబ్బందుల పాలు చేసిన బీఆర్‌ఎస్

సంగెం : గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పాల న సాగించిన సర్పంచ్‌లను అప్పులపాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని పర కాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చెప్పారు. బుధవారం మం డల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా గ్రామాల సర్పంచ్‌లను ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు. సంగెం మండలంలో చేసిన పనులకు గాను అధికారులు అందించిన లెక్కల ప్రకారం రూ.15 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని వివరించారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు తీవ్రంగా కృషిచేయనున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. బుధవారం మండల కేంద్రంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారందరికీ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సిఎం రేవంత్ రెడ్డి నాయత్వంలో పేదలందరికీ ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారని అన్నారు. గ్రామాల్లో అర్హులైన వారి జాబితాలను అధికారులు దగ్గర ఉంచుకొని సంక్షేమ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసి తీరుతామని చెప్పారు. ఐదేళ్లపాటు రాష్ట్రంలో పరిపాలన అందించి ప్రజల మన్ననలను పొందుతామని చెప్పారు. ఇప్పటికే సీఎం పేదింటి ఆడపిల్లలకు తులం బంగారంతో పాటు లక్ష రూపాయలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారని చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని 34 మందికి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కందకట్ల ఎంపీపీ కళావతి, జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, వైస్ ఎంపీపీ మల్లయ్యలతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ట్యాక్స్ మేళా

5వ పేజీ తరువాయి

వినతిపత్రాన్ని అందచేయడంతో అధికారుల పరిశీలన ప్రారంభమవుతుందన్నారు. వెను వెంటనే చర్యలు చేపడతారని తెలిపారు. ఆన్‌లైన్ సేవలన్నీ కూడా సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఉంటాయని, వీటిని కూడా నగరవాసులు పొందవచ్చన్నారు. నగరాభివృద్ధి కోసం ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించాలని, అదే విధంగా వ్యాపారులు ట్రేడ్ ఫీజులు చెల్లించాలని కోరారు. వాస్తవానికి డిసెంబర్ మాసంలోనే పన్నుల చెల్లింపులు పూర్తి కావాల్సి ఉందని, ఇకనైనా పన్నులు చెల్లించని వారు వెంటనే స్పందించాలని కోరారు.

అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ మాట్లాడుతూ.. మేళాలో 13 వినతిపత్రాల సమర్పణ జరిగిందని తెలిపారు. వీటిని రెవెన్యూ సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని, నగర వాసులకు సత్వర సేవలు అందించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకుడు ఆనంద్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ నోటీసుల జారీ చేస్తాం...

ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు అందచేస్తామని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. బుధవారం వరంగల్‌లోని గోపాలస్వామి గుడి తదితర ప్రాంతాల్లో బల్దియా సిబ్బంది చేపట్టిన పన్నుల వసూళ్ల తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మాషూక్ రబ్బాని ఉర్సుకు సర్వం సిద్ధం

5వ పేజీ తరువాయి

తెలంగాణలోని అన్ని జిల్లాలు, దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మత గురువులు, భక్తులు, సందర్శకులు వస్తుంటారు.

ఉచిత అన్నదానం

మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాల సమయంలో దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉర్సు నయీ గడిలో పీఠాధిపతుల ఆధ్వర్యంలో వేలాది మందికి ఉచిత మహాన్నదాన కార్యక్రమాన్నినిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాషుక్ రబ్బాని రహమతుల్లా అలై 13వ తరానికి చెందిన వారసులు, పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో ఉత్సవాలకు వస్తున్న అశేష ప్రజానికానికి నయీగడీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

విశాలమైన మజీద్

దర్గా పరిసరాలల్లో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు విశాలమైన మజీద్ అన్ని హంగులతో సిద్ధంగా ఉంటుంది. ఒకేసారి దాదాపు 1500 మంది సామూహికంగా ప్రార్థనలు చేసుకునే అవకాశం ఈ దర్గాలో ఉంది. ప్రతీ శుక్రవారం వేల సంఖ్యలో ముస్లింలు ఈ దర్గా ప్రాంగణంలోని మజీద్‌లో ప్రార్థనలు చేస్తారు.

ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయండి

- మషూక్ రబ్బాని వంశీకుడు సయ్యద్ మోహినోద్దిన్ అహ్మద్ బక్త్యార్ ఖాద్రీ

కరీమాబాద్, జనవరి 31: ఉర్సు ప్రాంతంలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 4 వ తేదీ వరకు జరిగే మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాషూక్ రబ్బానీ వంశీకుల వారసుడైన సయ్యద్ మోహినోద్దిన్ అహ్మద్ బక్త్యార్ ఖాద్రీ అలియాస్ హసిబ్ పాషా తెలిపారు. బుధవారం దర్గా సమీపంలోని గడిలో విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 యేళ్ల చరిత్ర కలిగిన మాషూక్ రబ్బాని దర్గా ఎంతో మహిమాన్వితమైనదని అన్నారు. మాషూక్ రబ్బాని వంశీకులైన తమ ముత్తాతలైన సయ్యద్ అలీ ముర్తుజా ఖాద్రీ వారసత్వంగా ఈ ఉత్సవాలను తాము క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. దర్గాలో నిర్వహించే సందల్ ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ దర్గా ఉత్సవాలకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. దర్గా ఉత్సవాలకు వచ్చే అశేష భక్త జనాలకు గడీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దర్గా ఉత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జమాలుద్దిన్ అహ్మద్ ఖాద్రీ అలియాస్ ఖాలీద్ పాషా, సయ్యద్ హబీబ్ ఆలం ఖాద్రీ, ఉర్దు జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు సాజిత్ పాషా, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతరలో ఏర్పాట్లు పూర్తి చేయాలి

కరీమాబాద్, జనవరి 31: ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు హన్మకొండ జిల్లా అమ్మవారిపేటలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరుతూ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు కమిషనర్ రిజ్వాన్ బాషాకు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో ఆర్గనైజర్స్ దాసి రాందేవ్, ఆవునూరి కుమారస్వామి, ఆవునూరి రాంమ్మూర్తి తదితరులు ఉన్నారు.



వృథాగా పోతున్న మిషన్ భగీరథ తాగునీరు

చెన్నారావుపేట, జనవరి 31: మండలంలోని చెరువుకొమ్ముతండా- బోడ మాణిక్యం తండాకు వెళ్లే ప్రధాన దారి పక్కన మిషన్ భగీరథ పైపు లైన్ పగలడంతో తాగు నీరు వృథాగా పోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవటంలేదని తండవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే దారికి వెళ్లే పైపు లైన్ పక్కనే టీ ఫైబర్ నెట్ కేబుల్ కోసం కందకాలు తవ్వుతున్నారు. ఈ క్రమంలోనే కందకాలు తీస్తున్న క్రమంలో మిషన్ భగీరథ తాగు నీరు పైపులు పగలడంతో గత ఐదు రోజులుగా తాగు నీరు వృథాగా పోతుందని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరువ తీసుకొని పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగు నీరు అందించాలని తండావాసులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

జంతు హింస నివారణ చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

చెన్నారావుపేట, జనవరి 31: మండల కేంద్రంతో పాటు జల్లి, గ్రామాల్లో జంతువుల హింస నివారణ చట్టాలపై అవగాహనను బుధవారం కల్పించారు. జంతు హింస నివారణ పక్షోత్సవాల్లో భాగంగా జంతు హింస నివారణ సంఘం(ఎస్‌పీసీఏ) వారి ఆధ్వర్యంలో హై స్కూల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధన అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ జంతువులను హింసించరాదని, జంతువులను సంరక్షించుకోవడం అందరి బాధ్యతని అన్నారు. జంతువుల హింసపై చట్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, బహుమతులను అందించారు. అలాగే ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్, హెచ్‌ఎం సరళ, పాపమ్మ, డాక్టర్ మంజీలాల్, డాక్టర్ రాధిక, రమేష్,లేనివో, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఒరియంటేషన్ తరగతులు

చెన్నారావుపేట, జనవరి 31: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఓరియేంటేషన్ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంపెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, మండల స్పెషల్ అధికారి బాలకృష్ణలు మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో జీపీఏ10/10 సాధించడానికి కృషి చేయాలన్నారు.పరీక్షలంటే భయభ్రాంతులకు గురి కావద్దన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. విద్యార్థులు ఓరియెంటేషన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బైరీ సరళ, రవి,లింగమూర్తి, రెహమాన్, జగన్మోహన్, కృష్ణామూర్తి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సస్పెషన్ ఎత్తివేత

చెన్నారావుపేట, జనవరి 31 : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌పై చేసిన సస్పెషన్‌ను ఎత్తివేసినట్లు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నర్సయ్యగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఆయనపై వేసిన సస్పెషన్‌ను ఎత్తివేయటం జరిగిందన్నారు.

అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి

వర్ధన్నపేట రూరల్, జనవరి 31 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని గ్రామ సర్పంచ్ మంద సతీష్ అన్నారు. బుధవారం మండలంలోని కడారిగూడెంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద దళిత, బడుగు బలహీన వర్గాలకు సైతం సమాజంలో గుర్తింపు ఉండాలనే ఆలోచనతో అంబేద్కర్ చేసిన కృషి ఎన్నటికీ మరువలేమన్నారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం చందాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

వర్ధన్నపేట, జనవరి 31 : రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ, తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను ఈ నెల 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఫోరం అధ్యక్షుడు తాటిపాముల రమేశ్, ప్రధాన కార్యదర్శి పోలేపల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరు కావాలని వారు సూచించారు.

ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం అడ్డుకోవడం సరికాదు

వర్ధన్నపేట, జనవరి 31 : రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవడం హేయమైన చర్య అని తెలంగాణ జనసమితి పార్టీ వరంగల్ జిల్లా నాయకుడు ఎలిశాల రాజేష్ అన్నారు. బుధవారం ఆయన వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మాట్లాడుతూ గవర్నర్ కోటాలో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా నియామకం చేసిన సందర్భంగా ప్రమాణ స్వీకారానికి మండలి చైర్మన్, కేటీఆర్ ఆడిన డ్రామాలో భాగమే ప్రమాణ స్వీకారం ఆగిందన్నానరు. బీఆర్ఎస్ పార్టీ నాయకులది అనైతిక చర్య అని, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి ప్రజలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

అంతర్గత రోడ్లతోనే గ్రామాల్లో అభివృద్ధి

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ, జనవరి 31 : అంతర్గత రోడ్ల నిర్మాణంతో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తాయని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామంలోని దళిత కాలనీల్లో నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నిరంకుశ నిర్ణయాలతో సర్పంచులకు పదవులు గండంగా మారి వారికి ఆత్మహత్యలే శరణ్యమయ్యాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులకు గురైన సర్పంచ్‌లు ప్రజల సమస్యలను తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరితతిరువల్, నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, ఎంపీటీసీ బండారుపల్లి వినయకుమార్,శ్రీనివాస్, ఉపసర్పంచ్ బోడ సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నాయకులు రావుల హరిష్‌రెడ్డి, పెండ్యాల హరిప్రసాద్, రాచకొండ రఘు, బండి శివకుమార్, బానోతు గోపి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ అవరణలోని ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.30 లక్షలను సాంక్షన్ చేసినట్లు చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో గ్రామ పంచాయతీకి ఆదాయం సమకురుతుందన్నారు. ఈ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. అలాగే గ్రామ పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో జీపీ పాలక మండలి సమావేశాలను నిర్వహించడానికి రేకుల షెడ్ల నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, ఎంపీటీసీ ఈదునూరి కరిష్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాత ప్రాణదాతతో సమానం

ఖానాపురం: రక్తదాత ప్రాణదాతతో సమానమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధరావుపేటలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 57మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, పండ్లు, గుడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులను, రక్తదాతలను ఆయన అభినందించాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీటీసీలు బిక్కి లింగమ్మమురళి, పూల్‌సింగ్, నాయకులు మోడెం ఎల్లగౌడ్, చెడిపాక ఉపేందర్, చాంద్‌పాషా, పులి వెంకన్న, పూల్యానాయక్, గుడిసె సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

రాయపర్తి, జనవరి 31 : మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామంలో బుధవారం ఎస్ఆర్ఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న గ్రామాల్లో గ్రంథాలయాలో మరో దేవాలయాలని, యువత వీటిని వినియోగించుకోవాలన్నారు. గత చరిత్ర తెలుసుకోవడం, వర్తమాన విషయాలను అధ్యయం చేయడం గ్రంథాలయాల ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాదె హేమలత రవీందర్ రెడ్డి, మైలారం సర్పంచ్ లేతాకుల సుమతి యాదవరెడ్డి, సంతోష్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్కం సురేష్, ఎంపీటీసీ రజిత వీరస్వామి, ఎలుకపెల్లి రాణి రాజు, సంధి అమ్మిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొండాపురం సర్పంచ్‌కు సన్మానం

రాయపర్తి, జనవరి 31 : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కోదాటి దయాకర్‌రావును స్థానిక నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో శాలువాతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రావు, ఎద్దు రమేష్, కార్యదర్శి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాములు



సమావేశంలో అభివాదం తెలుపుతున్న సంఘ నాయకులు

నెక్కొండ, జనవరి 31 : తెలంగాణ రాష్ట్రంలో ఇరవై శాతం జనాభ కల్గిన యాదవ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక సుమంగళి పంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన యాదవ హక్కుల సమావేశంలో ఆయన మాట్లాడుతు యాదృవుల అన్ని రంగాల్లో అభివృద్ధి పర్యుటకు ప్రభుత్వ యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. జీవనోపాధి కరువై దుర్భరమైన జీవనం సాగిస్తున్న యాదవుల కుటుంబాలకు రెండవ విడత గోర్లు పంపిణి చేయాలని , ప్రతి గ్రామంలో గోర్లు , మేకల మేతను పెంచుటకు ప్రభుత్వం ఐదు నుండి పది ఏకరాల స్థలం కేటాయించాలని కోరారు. యాదవులు హక్కుల సాధనకు గాను సంఘటితమై ఐక్యంగా పోరాలు చేసినప్పుడే వారి సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి అయిలయ్య, కుమారస్వామి, దొంగల అయిలయ్య రమేశ్, రాజ్‌కుమార్, సుంకర్యాబోయిన అయిలయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడుగా రమేశ్‌యాదవ్

యాదవ హక్కుల సంఘం పోరాట సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడుగా నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ముర‌మేశ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి మేకల రాములు తెలిపారు. బుధవారం నెక్కొండలో సుమంగళి పంక్షన్ హాల్‌లో ఎన్నికలను నిర్వహించారు. కాగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు తోకల కుమారస్వామి, వరంగల్ రూరల్ అధ్యక్షుడు తోటకుర రాజు, వర్కింగ్ అధ్యక్షుడు కన్నెబోయిన కుమారస్వామిలను ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ట్యాక్స్ మేళా

5వ పేజీ తరువాయి

వినతిపత్రాన్ని అందచేయడంతో అధికారుల పరిశీలన ప్రారంభమవుతుందన్నారు. వెను వెంటనే చర్యలు చేపడతారని తెలిపారు. ఆన్‌లైన్ సేవలన్నీ కూడా సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఉంటాయని, వీటిని కూడా నగరవాసులు పొందవచ్చన్నారు. నగరాభివృద్ధి కోసం ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించాలని, అదే విధంగా వ్యాపారులు ట్రేడ్ ఫీజులు చెల్లించాలని కోరారు. వాస్తవానికి డిసెంబర్ మాసంలోనే పన్నుల చెల్లింపులు పూర్తి కావాల్సి ఉందని, ఇకనైనా పన్నులు చెల్లించని వారు వెంటనే స్పందించాలని కోరారు.

అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ మాట్లాడుతూ.. మేళాలో 13 వినతిపత్రాల సమర్పణ జరిగిందని తెలిపారు. వీటిని రెవెన్యూ సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని, నగర వాసులకు సత్వర సేవలు అందించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకుడు ఆనంద్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ నోటీసుల జారీ చేస్తాం...

ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు అందచేస్తామని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. బుధవారం వరంగల్‌లోని గోపాలస్వామి గుడి తదితర ప్రాంతాల్లో బల్దియా సిబ్బంది చేపట్టిన పన్నుల వసూళ్ల తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

తెలంగాణ ఉద్యమవ్యాప్తికి గద్దర్ చేసిన కృషి మరువలేనిది

టీజేఎస్ నాయకులు గుంటిరాంచందర్, ఎస్కెజావిద్



నర్సంపేటలో గద్దర్ చి త్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీజెఎస్ నాయకులు

నర్సంపేట. జనవరి 31 : తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి ప్రజాగాయకుడు, యుద్ధనౌక గద్దర్ చేసిన కృషి మరువ లేనిదని తెలంగాణ జనస మితి(టీజేఎస్) రాష్ట్రకమిటీ సభ్యుడు గుంటి రాంచందర్, జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ అన్నారు. గద్దర్ జయంతి సందర్భంగా పట్టణంలోని టీజెఎస్ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు ప్రజల్లో ఉద్యమవ్యాప్తికి గద్దర్ ఎనలేని కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్‌ను అవమానరీతిలోకి నెట్టి వారి చచావుచావుకు కారణమైందన్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ కోదండరామ్‌పై కుట్రతో వ్యవహరిస్తుందన్నారు. తనతో సమానమైన ఉద్యమనేతను గుర్తించలేని కేఆర్ ఇప్పుడు కాంగ్రెస్ గుర్తించి గౌరవిస్తే ఓర్వలేక పోతున్నారని వారు విమర్శించారు. కేసీఆర్ పార్టీని భూస్థాపితం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్రకమిటీ సభ్యుడు బొనగాని రవీందర్, సాంబరాతి మల్లేషం, కల్యాణ్, శుభాస్, కిషోర్, అశోక్, జావెద్, సర్వేశం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అధికారుల నియామకం

నర్సంపేట టౌన్, జనవరి 31: నర్సంపేట మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు వీరే. ఆకులతండ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా మెండు అశోక్, బాంజిపేటకు డాక్టర్ ఎం.వింధ్య, భోజ్యానాయక్ తండాకు పి.సందీప్, చంద్రయ్యపల్లెకు రజినికాంత్, చిన్న గురిజాలకు పి.శ్రీనివాసరావు, దాసరిపల్లెకు కె.మహేందర్, ఏనుగల్‌తండాకు ఎం. పారిజాతం, జీజీఆర్ పల్లె ఎం.సురేష్, గుంటూరుపల్లె ఎ.సత్యనారాయణ, గురిజాల ఎ.శ్రీనివాసరావు, ఇప్పల్‌తండకు ఎం.డి. షాబుద్దిన్, ఇటుకాలపల్లికు వి. ప్రవీన్‌కుమార్, కమ్మపల్లికు ఎ.జ్యోతి, లక్నేపల్లికు కె.విశ్వప్రసాద్, మాధన్నపేటకు జి.శ్యామ్, మహేశ్వరంనకు టి.కృష్ణకుమార్, మగ్దుంపురంనకు ఎ.సునిల్‌కుమార్‌రాజ్, ముత్తోజిపేటకు వి. ఝాన్సీ, ముత్యాలమ్మతండకు ఎం.భరత్, నాగుర్లపల్లెకు కె.నితిన్, పర్శనాయక్‌తండకు ఎస్.సంతోష్, రాజపల్లెకు ఎం.సతీష్, రాజేశ్వర్‌రావుపల్లెకు ఎం.డి. రజాక్, రాజుపేటకు కె.సంజీవరెడ్డి, రామవరంనకు కె. నవీన్, రాములునాయక్‌ండకు పి. భాస్కర్‌రావులను నియమించారు.

● దుగ్గొండి : మండలంలోని సర్పంచ్‌ల పదవీ కాలం ఈనెలతో ముగియడంతో 34 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను జిల్లా అధికారులు నియమించారు. అడవిరంగాపురంనకు సీనియర్ అసిస్టెంట్ మమత, బంధంపల్లికి విద్యుత్ ఏఈ రామమూర్తి, బిక్కాజిపల్లికి ఆర్ఐ చిన్న మల్లయ్య, బొబ్బరోనిపల్లికి సీనియర్ అసిస్టెంట్ సంపత్, చలపర్తికి వెటర్నరీ డాక్టర్ శారద, చంద్రయ్యపల్లికి ఏఈవో రాజేష్, చాపలబండకు డీఈ రామకృష్ణ, దేశాయిపల్లికి జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, దుగ్గొండికి తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, గిర్నిబావికి సూపరింటెండెంట్ రవి కుమార్, గొల్లపల్లికి వెటర్నరీ డాక్టర్ రాంమోహన్, గుడ్డెల్లుపల్లికి ఏఈవో హన్మంత్, గుడిమహేశ్వరంనకు అసిస్టెంట్ వెటర్నరీ డాక్టర్ గఫర్, కేశవపురంనకు ఏఈవో విశ్వ శాంతి, లక్ష్మీపురంనకు సూపరింటెండెంట్ రవికుమార్, మదిరమండపల్లికి జూనియర్ అసిస్టెంట్ రాజేందర్, మహ్మదాపురంనకు అసిస్టెంట్ స్టాటికల్ అధికారి పవన్‌కుమార్, మల్లంపల్లికి జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, మంద పల్లికి ఏఈ వెంకటేశ్వర్లు, మర్రిపల్లికి ఆర్ఐ రాంబాబు, ముద్దునూర్‌కు వెటర్నరీ డాక్టర్ బాలాజీ, మైసంపల్లికి సీనియర్ అసిస్టెంట్ వీరన్న, నాచినపల్లికి ఎంపీవో శ్రీధర్ గౌడ్, నారాయణతండా ఏఈవో మధు, పీజీతండాకు ఏఈ రవి, పొనకల్‌కు సర్వేయర్ స్వాతి, రాజ్యాతండాకు జూనియర్ అసిస్టెంట్ నవ్య, రెబల్లేకు ఏఈ సతీష్, రేకంపల్లికి టైపిస్టు కరణశ్రీ, శివాజీనగర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, స్వామిరావుపల్లికి సూపర్‌వైజర్ జయరాణి, తిమ్మంపేటకు ఏవో దయాకర్, తొగర్రాయికి విద్యుత్ ఏఈ సురేశ్, వెంకటాపురంనకు ఎంపీడీవో కృష్ణప్రసాద్ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మాషూక్ రబ్బాని ఉర్సుకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

తెలంగాణలోని అన్ని జిల్లాలు, దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మత గురువులు, భక్తులు, సందర్శకులు వస్తుంటారు.

ఉచిత అన్నదానం

మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాల సమయంలో దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉర్సు నయా గడిలో పీఠాధిపతుల ఆధ్వర్యంలో వేలాది మందికి ఉచిత మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాషూక్ రబ్బాని రహమతుల్లా అలై 13వ తరానికి చెందిన వారసులు, పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు వస్తున్న అశేష ప్రజానికానికి నయాగడీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

విశాలమైన మజీద్

దర్గా పరిసరాలల్లో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు విశాలమైన మజీద్ అన్ని హంగులతో సిద్ధంగా ఉంటుంది. ఒకేసారి దాదాపు 1500 మంది సామూహికంగా ప్రార్థనలు చేసుకునే అవకాశం ఈ దర్గాలో ఉంది. ప్రతీ శుక్రవారం వేల సంఖ్యలో ముస్లింలు ఈ దర్గా ప్రాంగణంలోని మజీద్‌లో ప్రార్థనలు చేస్తారు.

ఉర్సు దర్గా ఉత్సవాలను విజయవంతం చేయండి

మషూక్ రబ్బాని వంశీకుడు సయ్యద్ మోహినోద్దిన్ అహ్మద్ బక్త్యార్ ఖాద్రీ



దర్గా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాషూక్ రబ్బాని వంశీకుడు

కరీమాబాద్, జనవరి 31: ఉర్సు ప్రాంతంలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 4 వ తేదీ వరకు జరిగే మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాషూక్ రబ్బానీ వంశీకుల వారసుడైన సయ్యద్ మోహినోద్దిన్ అహ్మద్ బక్త్యార్ ఖాద్రీ అలియాస్ హసిబ్ పాషా తెలిపారు. బుధవారం దర్గా సమీపంలోని గడిలో విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 యేళ్ల చరిత్ర కలిగిన మాషూక్ రబ్బాని దర్గా ఎంతో మహిమాన్విత మైనదని అన్నారు. మాషూక్ రబ్బాని వంశీకులైన తమ ముత్తాతలైన సయ్యద్ అలీ ముర్తుజా ఖాద్రీ వారసత్వంగా ఈ ఉత్సవాలను తాము క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. దర్గాలో నిర్వహించే సందల్ ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ దర్గా ఉత్సవాలకు దేశ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. దర్గా ఉత్సవాలకు వచ్చే అశేష భక్త జనాలకు గడీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దర్గా ఉత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జమాలుద్దిన్ అహ్మద్ ఖాద్రీ అలియాస్ ఖాలీద్ పాషా, సయ్యద్ హబీబ్ ఆలం ఖాద్రీ, ఉర్దు జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు సాజిత్ పాషా, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలి'



వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

నర్సంపేట, జనవరి 31: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ నాయకుడు నాగెల్లి కొమురయ్య. రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. డిగ్రీ కళా శాలకు చెందిన స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించామన్నారు. డిగ్రీ కళాశాల స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలని వారు అధికారులను కోరారు. పీజీ కళాశాలకు హాస్టల్ మంజూరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, జన్ను రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల క్షేత్ర సందర్శన

పర్వతగిరి, జనవరి 31: జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద మండలంలోని కల్లెడ, ముంజాల కుంట తండా, రావూరు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ బుధవారం పరిశీలించారు. పంటల్లో చీడపీడల నివారణకుగాను రైతులకు నివారణోపాయాలను సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అధికారుల స లహాలు, సూచనలతో పంటల సాగు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ఎం కన్సల్టెంట్ పి.సారంగం, ఏఈవో చందూ లాల్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి సాగు చేసిన పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి రైతులు తగుసూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ సూచించారు. మండలంలోని గిరిబావి, తొగర్రాయి, రేకంపల్లి, శివాజీనగర్‌లో సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనిగ పంటలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ సందర్శించి పరిశీలన చేశారు. పంటలు సాగు చేసిన ప్రారంభదశలోనే అధికారుల సూచనలు పాటించి పంట దిగుబడి పొందాలన్నారు. వేరుశనిగ పంటకు 200 కిలోల జిప్సంను వేసుకుంటే కాయల సైజు బాగా ఉండి నాణ్యమైన గింజలు వస్తాయన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ప్రభావం ఉందని ప్రారంభదశలోనే వేప నూనె 5 మిల్లీ లీటర్లను నీటిలో కలసి పిచికారి చేయాలని సూచించారు. వాతావరణ ప్రభావంతో వస్తాన్న పంటల చీడపురుగులను నివారించుటకు నియమాలు పాటించాలన్నారు. ఈ పరిశీలనలో జిల్లా కన్సల్టెంట్ ఎన్ఎఫ్ఎస్ఎం సారంగం, ఏఈవో మోడెం విశ్వశాంతి, రైతులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి బోనాలు

పర్వతగిరి, జనవరి 31: ముదిరాజుల కులదైవమైన పెద్దమ్మతల్లికి బుధవారం బోనాలు చెల్లించారు. మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి, గంగమ్మతల్లి ఆలయాల 12వ వార్షికోత్సవం సందర్భంగా మహిళలు పెద్దఎత్తున బోనాలతో తరలివెళ్లారు. పెద్దమ్మ, గంగమ్మ తల్లులకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ ఏటా రెండు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకల్లో పలు ప్రాంతాల నుంచి కులస్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని సంఘం అధ్యక్షుడు నీరటి వెంకన్న,ఉపాధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రావుల రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అంబటి కుమార్, నీరటి రమేష్, మొగిలి శ్రీను, చీరబోయిన రాజు, చెన్నూరి వెంకటేశ్వర్లు, చెవ్వ వెంకటేశ్వర్లు, సభ్యులు మహంకాళి రామస్వామి,పాక రమేష్ పాల్గొన్నారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

దుగ్గొండి, జనవరి 31: విద్యార్థులు మూల్యాంకనం పట్ల అవగాహన కలిగి ఉంటే రాబోయ్యే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం జరుగుతుందని డీఈవో వాసంతి, జీసీడీవో ఫ్లోరెన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం డీఈవో వాసంతి, జీసీడీవో ఫ్లోరెన్స్‌లు సందర్శించి ఉపాధ్యాయులతో విద్యార్థుల పరీక్ష పేపర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నట్లయితే మంచి జీపీఏ సాధించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ సమయం వృథా చేసుకోకుండా ప్రణాళికబద్ధంగా చదివి ధైర్యంగా ఉండి పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చదువుల సత్యనారాయణ, ఎంఎన్‌వో వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం రామస్వామి, రిసోర్స్ పర్సన్‌లు హమ్మద్, జనార్ధన్, రజిని, శ్రీనివాస్ మొగిలి, మహేంద్రనాథ్, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

దుగ్గొండి, జనవరి 31 : విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమై ఇంట్లోని విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైన సంఘటన మండలంలోని తిమ్మంపేటలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్గొండ నర్సయ్య ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి కాలిపోతుండగా వృద్ధుడైన నమ్మయ్యను స్థానికులు బయటకు తీసుకొచ్చారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అదుపులోకి రాకపోవడంతో, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చెరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. నర్సయ్య ఇంట్లో ఉన్న రూ.20 వేలు నగదు, బట్టలు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.

జాబ్‌మేళా విజయవంతం

నర్సంపేట టౌన్, జనవరి 31 : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి అధికారి ఎస్. మాధవి ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా విజయవంతం గా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు కార్పొరేట్ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి జాబ్ మేళాలు ఉపయోగపడతాయన్నారు. తమ కళాశాల నిరంతరం విద్యార్థులకు నిరంతరం విద్యా బోధనతో పాటు వ్యక్తిత్వ వికాసం కోసం అన్ని సౌకర్యాలు కల్పించడానికి ముందుంటుందన్నారు. ఉద్యోగాలతో పాటు విద్యార్థులు స్వయం ఉపాధిమార్గాలు అన్వేషించి మరికొంత మంది ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.శ్రీనాథ్, పి.త్యాగయ్య, ఈడీసీ కో ఆర్డినేటర్ విష్ణుకుమార్ పాల్గొన్నారు.